
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
అల్లూరి సీతారామరాజు
జిల్లా వార్తలు
సోమవారం 18 మార్చి 2024



దారితెన్నూ లేకపాయె!

అటకెక్కిన మిషన్ కనెక్ట్ పాడేరు పథకం

అరకులోయ, మార్చి 17:

కొండ శిఖర గ్రామాలకు రహదారి సౌకర్యం కల్పించాలన్న లక్ష్యంతో ప్రారంభించిన మిషన్ కనెక్ట్ పాడేరు పథకం నీరుగారిపోయింది. 2018-19లో ఈ పథకంలో భాగంగా గిరిజన సంక్షేమశాఖ, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖల ఆధ్వర్యంలో 30 రహదారులు నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకుని పనులు ప్రారంభించినా నిధుల కొరత వల్ల ఒక్క రోడ్డు కూడా పూర్తికాలేదు. దీంతో ఆదివాసీలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అనారోగ్యంతో ఉన్న వాళ్లను అత్యవసర సమయాల్లో ఆస్పత్రికి తరలించాలంటే డోలీమోతలు తప్పడం లేదు.

- కొండ శిఖర గ్రామాలకు రహదారి సౌకర్యం కల్పించాలన్న లక్ష్యం నీరుగారిన వైనం
- 30 రహదారులు నిర్మించాలని నిర్దేశించగా ఒక్కటీ పూర్తికాని దుస్థితి
- వైసీపీ ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడమే కారణం
- ఆదివాసీలకు తప్పని ఇబ్బందులు

కొండ శిఖర గ్రామాలకు రవాణా సదుపాయం కల్పించాలన్న ఉద్దేశంతో అప్పటి ఐటీడీఏ పీవో రోణంకి గోపాలకృష్ణ మిషన్ కనెక్ట్ పాడేరు పథకాన్ని అమల్లోకి తెచ్చారు. ఐటీడీఏ పరిధి 11 మండలాల్లో కొండ శిఖర గ్రామం నుంచి దిగువ, సమీపంలో రహదారి ఉన్న గ్రామం వరకు రోడ్డు కనెక్ట్ చేయాలని, అవసరమైన కల్వర్టులు, సీసీ ర్యాంప్‌లను పూర్తిచేసి కనీసం వాహనాల రాకపోకలకు ఎటువంటి అంతరాయం లేకుండా చూడాలనే ఉద్దేశంతో ఇంజనీరింగ్ అధికారులతో అంచనాలు వేయించి ప్రభుత్వ ఆమోదంతో పనులు ప్రారంభించారు. నిర్దేశించిన 30 రహదారుల్లో గిరిజన సంక్షేమ శాఖకు 17, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖ ఆధ్వర్యంలో 13 రోడ్ల నిర్మాణ బాధ్యతలను అప్పగించారు. గిరిజన సంక్షేమశాఖకు అప్పగించిన రోడ్లు అన్ని ప్రారంభమైనా నిధుల కొరత వల్ల ఏ ఒక్కటీ పూర్తికాలేదు. అలాగే పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖకు అప్పగించిన 13 రోడ్లకు రెండు మాత్రమే ప్రారంభంకాగా అవి కూడా కాంట్రాక్టరుకు బిల్లులు రాకపోవడంతో నిలిచిపోయాయి.


మొర్రిగుడ- అంటిపర్తి మార్గంలో రహదారి నిర్మించని దృశ్యం


అసంపూర్తిగా ఉన్న జయంతివలస- బొండాం కొత్తవలస రహదారి


జయంతివలస- కొత్తవలస మధ్య పెద్ద గెడ్డపై నిర్మించిన వంతెనకు అప్రోచ్ రోడ్డు లేని దృశ్యం

పాత రోడ్ల మరమ్మతులకు కలగని మోక్షం

మండలంలో పలు రహదారులు మరమ్మతులకు గురయ్యాయి. వీటిలో సుంకరమెట్ట- వర్రా, సుంకరమెట్ట- గన్నెల, హట్టగుడ- రణజిల్లడ-యండపల్లి వలస రింగ్‌రోడ్డు ఉన్నాయి. వీటి మరమ్మతులకు పంచాయతీరాజ్ శాఖ అధికారులు ప్రతిపాదనలు తయారు చేసి ప్రభుత్వానికి పంపారు. అయితే నిధులు విడుదలకాకపోవడంతో పనులు జరగలేదు.

ప్రారంభించి అసంపూర్తిగా ఉన్న రహదారులివి..

మారుమూల లోతేరు పంచాయతీ పరిధిలో శివారు గ్రామాలకు రహదారి సౌకర్యంలో భాగంగా ప్రారంభించిన ... మిగతా 8వ పేజీలో

నేటి నుంచి టెన్త్ పరీక్షలు

జిల్లాలో హాజరుకానున్న విద్యార్థులు 12,051 మంది

- 65 పరీక్షా కేంద్రాలు
- ప్రతి కేంద్రం పరిధిలో 144 సెక్షన్
- విద్యాశాఖ కంట్రోల్ రూమ్ నంబర్లు: 9490204585, 9493426468
- నామమాత్రంగా సీసీ కెమెరాల ఏర్పాటు


పాడేరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పరీక్షలకు ఏర్పాట్లు చేస్తున్న హెచ్ఎం విశ్వప్రసాద్ తదితరులు

పాడేరు, మార్చి 17(ఆంధ్రజ్యోతి):

జిల్లాలో సోమవారం నుంచి పదో తరగతి పరీక్షలు ప్రారంభంకానున్నాయి. దీనికి అవసరమైన ఏర్పాట్లను కలెక్టర్ ఎం.విజయసునీత ఆధ్వర్యంలో పూర్తి చేశారు. జిల్లాలోని 22 మండలాల పరిధిలో 65 పరీక్షా కేంద్రాల్లో 12,051 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. వీరిలో 10,986 మంది రెగ్యులర్, 1,065 మంది ప్రైవేటు విద్యార్థులుకాగా, మొత్తం విద్యార్థుల్లో 5,066 మంది బాలురు, 5,920 మంది బాలికలున్నారు. పరీక్ష పత్రాలను భద్రపరిచేందుకుగాను 22 పోలీస్‌స్టేషన్లను పాయింట్‌లుగా అధికారులు గుర్తించారు. సోమవారం నుంచి ఈనెల 30 వరకు జరిగే పరీక్షలను పర్యవేక్షించేందుకు గాను 65 మంది చీఫ్ సూపరింటెండెంట్‌లు, 65 మంది డిపార్టుమెంట్ ఆఫీసర్లు, నలుగురు ఫ్లయింగ్ స్క్వాడ్‌లను, 634 మంది ఇన్విజిలేటర్లను అధికారులు నియమించారు. అలాగే ప్రతి పరీక్షా కేంద్రం పరిధిలో 144 సెక్షన్‌ను అమలు చేయడంతో పాటు విద్యార్థులకు మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నారు. పరీక్షలకు సంబంధించిన ఎటువంటి సమస్యలపైనా విద్యార్థులు తెలిపేందుకు కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు సమస్యలను తెలియజేసేందుకు 9490204585, 9493426468 సెల్ నంబర్లకు సంప్రతించాలని విద్యాశాఖాధికారులు కోరారు. జిల్లాలోని టెన్త్ పరీక్షలను జిల్లా విద్యాశాఖాధికారి పి.బ్రహ్మాజీరావు, గిరిజన సంక్షేమ విద్యాశాఖ ఉపసంచాలకుడు ఐ.కొండలరావు, మండల విద్యాశాఖాధికారులు పర్యవేక్షించనున్నారు.

నామమాత్రంగా సీసీ కెమెరాల ఏర్పాటు

జిల్లాలో పదో తరగతి పరీక్షా కేంద్రాల్లో నామమాత్రంగానే సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. వాస్తవానికి గతంలో 70 నుంచి 80 శాతం పరీక్షా కేంద్రాలకు సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. అయితే వైసీపీ ప్రభుత్వం పరీక్షల నిర్వహణకు నిధులు కేటాయించకపోవడంతో గత కొన్నాళ్లుగా పరీక్షా కేంద్రాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు విషయంలో అధికారులు సైతం మిన్నకున్నారు. గతంలో పాడేరు రెవెన్యూ డివిజన్ పరిధిలోనే 25 నుంచి 30 పరీక్షా కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. కానీ ప్రస్తుతం కేవలం ఆరు కేంద్రాల్లో మాత్రమే సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. జిల్లాలో ముంచంగిపుట్టు, అనంతగిరి, అరకులోయ మండలం కొత్తభల్లుగూడ, కూనవరం, మారేడుమిల్లి, రాజవొమ్మంగి కేంద్రాల్లో మాత్రమే సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు.

మే 19 నుంచి పాడేరు మోదకొండమ్మ ఉత్సవాలు

- మూడు రోజుల పాటు నిర్వహణ


సమావేశంలో మాట్లాడుతూ సర్పంచ్ ఉషారాణి


మోదకొండమ్మ అమ్మవారు

పాడేరురూరల్, మార్చి 17: గిరిజన ప్రాంత ప్రజల ఇలవేల్పు, ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్య దైవం పాడేరు మోదకొండమ్మ ఉత్సవాలను మే 19 నుంచి 21వ తేదీ వరకు నిర్వహించేందుకు ఆలయ ప్రధాన అర్చకులు తేదీలను ఖరారు చేశారని స్థానిక సర్పంచ్ కొట్టగుళ్లి ఉషారాణి, ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కొట్టగుళ్లి సింహాచలం నాయుడు తెలిపారు. ఆలయ కమిటీ ప్రతినిధులు ఆదివారం మధ్యాహ్నం అమ్మవారి ఆలయ ప్రాంగణంలో గ్రామ పెద్దలతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ఆలయ ప్రధాన అర్చకులు సుబ్రహ్మణ్యం.. అమ్మవారి ఉత్సవానికి అనువైన తేదీలను తెలియజేశారు. మే 12వ తేదీన అమ్మవారి పుట్టినరోజు జరపాలని నిర్ణయించారు. రాష్ట్ర గిరిజనోత్సవంగా గుర్తింపు పొందిన అమ్మవారి జాతరను చేపట్టే తేదీలను ప్రకటించారు. ఉత్సవ కమిటీని ఈ నెల 19వ తేదీన ఏర్పాటు చేయనున్నామని ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి సింహాచలం నాయుడు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు, గ్రామ పెద్దలు పలాసి కృష్ణారావు, వర్తన పిన్నయ్యదొర, లకే సింహాచలమమ్మ, జంపరంగి ప్రసాద్, బూరెడ్డి రామునాయుడు, కొమ్మోజు వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

శభాష్ 'మేధ'ర్షి

సైనిక్ స్కూల్ ప్రవేశ పరీక్షలో నునపర్తి విద్యార్థికి ఫస్ట్ ర్యాంక్

- 283/300 మార్కులు సాధించిన రెడ్డి మేధర్షి
- జాతీయస్థాయిలో 43వ ర్యాంకు


రెడ్డి మేధర్షి

అచ్యుతాపురం, మార్చి 17: కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో నడుస్తున్న సైనిక్ స్కూళ్లలో ఆరో తరగతిలో ప్రవేశాలకు నిర్వహించిన పరీక్షలో మండలంలోని నునపర్తి గ్రామానికి చెందిన రెడ్డి మేధర్షి రాష్ట్రస్థాయిలో ప్రథమ ర్యాంకు సాధించాడు. ఈ ఏడాది జనవరి 28వ తేదీన నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) ఈ ప్రవేశ పరీక్ష నిర్వహించగా, ఈ నెల 14వ తేదీన ఫలితాలు వెల్లడయ్యాయి. రెడ్డి మేధర్షి 283/300 మార్కులు సాధించి జాతీయ స్థాయిలో 43వ ర్యాంకు, రాష్ట్ర స్థాయిలో మొదటి ర్యాంకు సాధించాడు. తల్లిదండ్రులు రాజేశ్, స్వర్ణలత ఉద్యోగరీత్యా హైదరాబాద్‌లో వుంటున్నారు. మేధర్షి రెగ్యులర్ పాఠశాలకు వెళుతూనే, ఆన్‌లైన్లో వైజాగ్ సైనిక్ అకాడమీ సెంటర్లో కోచింగ్ తీసుకున్నట్టు తల్లిదండ్రులు తెలిపారు.

అధికార, విపక్ష నేతలు ఇంటికే పరిమితం

ఎంపీ టికెట్ దక్కక ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి డీలా

- పాడేరు స్థానంపై ఇంకా స్పష్టత రాక మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి నిరాశ
- మోదకొండమ్మ ఉత్సవాల తేదీల ఖరారు సమావేశానికి ఇద్దరూ హాజరుకాని వైనం


ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి   మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి

(పాడేరు- ఆంధ్రజ్యోతి)

పాడేరు అసెంబ్లీ నియోజకవర్గంలో చిత్రమైన పరిస్థితి నెలకొంది. ఎక్కడైనా అధికార పక్షం దర్పంగా ఉంటే, విపక్షం కొంత డీలాగా ఉండడం సహజం. కానీ పాడేరులో అందుకు భిన్నంగా అధికార, విపక్షానికి చెందిన నేతలు ఒకే రకమైన స్థితిలో ఉండడం విశేషం. ఆదివారం పాడేరులో నిర్వహించిన మోదకొండమ్మ ఉత్సవాల తేదీల ఖరారు సమావేశానికి ఆలయ కమిటీ చైర్‌పర్సన్ హోదాలో స్థానిక ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి హాజరుకావాల్సి ఉంది. కానీ ఆమెకు తాజా ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం దక్కకపోవడంతో ఆవేదనతో ఇంట్లోనే ఉన్నారు. ఆఖరి నిమిషం వరకు తనకు అరకులోయ పార్లమెంట్ స్థానానికి టికెట్ దక్కుతుందని ఆశించినప్పటికీ అనూహ్యంగా అరకులోయ ఎమ్మెల్యే చెట్టి ఫాల్గుణ కోడలు డాక్టర్ తనుజారాణికి కేటాయించడంతో భాగ్యలక్ష్మి ఆవేదనతో వున్నారని తెలిసింది. దీంతో ఆమె శనివారం నుంచి ఇంటికే పరిమితమై ఎటువంటి కార్యక్రమాల్లో పాల్గొనలేదు. వాస్తవానికి మోదకొండమ్మ ఆలయ, ఉత్సవ కమిటీలకు సంబంధించిన ప్రతి కార్యక్రమానికి ఆమె హాజరవుతారు. అయితే తాజా పరిణామాల నేపథ్యంలో ఆమె హాజరుకాలేదు. ఆదివారం ఆలయంలో జరిగిన ఉత్సవాల తేదీల ఖరారు సమావేశంలో ఎమ్మెల్యే హాజరుకాకపోవడం చర్చనీయాంశంగా మారింది. కాగా విపక్షానికి చెందిన మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి సైతం ప్రస్తుతం అదే పరిస్థితిలో వున్నారు. పాడేరు అసెంబ్లీ టికెట్ తనకే దక్కుతుందనే తరుణంలో పొత్తులో భాగంగా బీజేపీకి కేటాయిస్తారని తెలియడంతో ఆమె డీలా పడ్డారని తెలిసింది. దీంతో ఆమె కూడా ఏ కార్యక్రమాల్లో పాల్గొనకుండా ఇంటికే పరిమితమయ్యారు. పాడేరులో అధికార, విపక్షానికి చెందిన వారు సైతం రాజకీయంగా డీలా పడి ఇంటికే పరిమితం కావడం ప్రస్తుతం మన్యంలో చర్చనీయాంశమైంది.

ఎన్నికల నిబంధనలను పక్కాగా అమలు చేయాలి

జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎం.విజయసునీత ఆదేశం

- పాడేరు, అరకులోయ, రంపచోడవరం ఆర్వోలతో టెలీ కాన్ఫరెన్స్


ఆర్‌వోలతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్న కలెక్టర్ ఎం.విజయసునీత

పాడేరు, మార్చి 17(ఆంధ్రజ్యోతి):

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పక్కాగా అమలు చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎం.విజయసునీత ఆదేశించారు. జిల్లాలోని పాడేరు, అరకులోయ, రంపచోడవరం అసెంబ్లీ నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులతో ఆదివారం ఆమె టెలీకాన్ఫరెన్స్ నిర్వహించి మాట్లాడారు. ఎన్నికల కమిషన్ షెడ్యూల్ వెలువడిన నేపథ్యంలో 24 గంటల్లోనే రాజకీయ నేతల చిత్రాలతో వున్న హోర్డింగ్‌లు, బోర్డులు విధిగా తొలగించాలన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు ప్రదేశాల్లోని ప్రచార, రాజకీయ సంబంధ అంశాలను తొలగించాలన్నారు. జాతీయ నేతలు, రాజకీయ నేతల విగ్రహాలకు ముసుగులు వేయాలని, అంబులెన్స్‌లు, పీటీడీ బస్సులు, ఇతర వాహనాలపై వున్న చిత్రాలను తొలగించాలన్నారు. ఆయా పనులపై ఆర్‌వోలు ప్రత్యేక శ్రద్ధ కనబరచాలన్నారు. అలాగే నామినేషన్ల స్వీకరణ, తదితర ప్రక్రియలకు సంబంధించిన ఏర్పాట్లను అసెంబ్లీ నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు పక్కాగా చేసుకోవాలన్నారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు ఇబ్బందులు లేకుండా సదుపాయాలు కల్పించాలని, స్క్వాడ్ బృందాలు, గణాంక బృందాలతో క్షేత్ర స్థాయి పరిశీలనలు జరిపి నివేదికలు సమర్పించాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఎన్నికల నిబంధనలను అతిక్రమించకుండా పక్కాగా అమలు చేసేలా రిటర్నింగ్ అధికారులు నిత్యం అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ విజయసునీత సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి పద్మావతి, ఎన్నికల కోడ్ నోడల్ అధికారి శివయ్య, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ పి.అంబేడ్కర్, పాడేరు, రంపచోడవరం, అరకులోయ రిటర్నింగ్ అధికారులు వి.అభిషేక్, ప్రశాంత్‌కుమార్, భావన వశిష్ఠ, తదితరులు పాల్గొన్నారు.

కోడ్ అమలుకు పటిష్ట చర్యలు

- ఎస్పీ తుహిన్‌సిన్హా


ఎస్పీ తుహిన్ సిన్హా

పాడేరు, మార్చి 17(ఆంధ్రజ్యోతి):

జిల్లాలో ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిందని, ఈ నేపథ్యంలో రాజకీయ పార్టీలు, ఉద్యోగులు, ప్రజలు సైతం ఎన్నికల నిబంధనలు పాటించాలని ఎస్పీ తుహిన్‌సిన్హా ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అరకులోయ పార్లమెంట్, పాడేరు, అరకులోయ, రంపచోడవరం అసెంబ్లీ స్థానాల పరిధిలో ఎన్నికల కోడ్‌ను పటిష్టంగా అమలు చేసేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. ఇందులో భాగంగా జిల్లాలో 5 అంతర్ రాష్ట్ర, 6 అంతర్ జిల్లా చెక్ పోస్టులను ఏర్పాటు చేస్తున్నామన్నారు. అలాగే 22 ఎన్నికల కోడ్ పరిశీలన బృందాలు, 17 ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్‌లు ఏర్పాటు చేశామని తెలిపారు. రాజకీయ పార్టీల సభలు, సమావేశాలు, మైక్‌ల ఏర్పాటుకు సంబంధించిన అనుమతులను సింగిల్ విండో విధానంలో ముందస్తుగా అనుమతి పొందాలన్నారు. ఆయా ప్రచారం కార్యక్రమాలను ఉదయం 6 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు మాత్రమే నిర్వహించాలన్నారు. ఓటర్లను ... మిగతా 8వ పేజీలో

రంజాన్ వేళలు

ఇఫ్తార్ (సోమ)	6.11
సహరి (మంగళ)	4.49

సీలేరు నదిలో నాటు పడవ మునిగి ఒకరి మృతి

- సురక్షితంగా బయటపడిన నలుగురు..
- వారపు సంతకు వెళ్లి వస్తుండగా ప్రమాదం


మజ్జి సీమయ్య మృతదేహం

సీలేరు, మార్చి 17: ఆంధ్రా, ఒడిశా సరిహద్దులో గల సీలేరు నదిలో నాటు పడవ మునిగి ఒడిశాకు చెందిన ఓ వ్యక్తి మృతి చెందాడు. దీనికి సంబంధించి వివరాలు ఇలా వున్నాయి. ఒడిశా మల్కన్‌గిరి జిల్లా కూర్మనూరు పంచాయతీ గిల్లమడుగు గ్రామానికి చెందిన మజ్జి సీమయ్య(40)తో పాటు మరో నలుగురు శనివారం అల్లూరి సీతారామరాజు జిల్లా బొడ్డగండి పంచాయతీ మంగంపాడు గ్రామంలో జరిగే వారపు సంతకు నాటు పడవపై సీలేరు నది దాటి వచ్చారు. సరకులు కొనుక్కుని సాయంత్రం తిరుగు ప్రయాణమయ్యారు. సాయంత్రం సమయంలో నీటి ప్రవాహం ఉండడంతో పాటు గాలులు వీచడంతో నాటు పడవ నది మధ్యలో బోల్తా కొట్టింది. దీంతో ... మిగతా 8వ పేజీలో

రోడ్డు ప్రమాదంలో ఒకరి దుర్మరణం

- విశాఖలో కాంగ్రెస్ బహిరంగ సభకు వెళ్లి వస్తుండగా ఘటన


లవకుశ మృతదేహం

పెదబయలు, మార్చి 17: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ప్రమాదం ఆదివారం వేకువజామున జరిగింది. దీనికి సంబంధించి స్థానిక ఇన్‌చార్జి ఎస్ఐ లక్ష్మణరావు తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. ముంచంగిపుట్టు మండలం బరడా పంచాయతీ బొడ్డపుట్టు గ్రామం నుంచి వ్యాన్‌లో ఐదుగురు వ్యక్తులు శనివారం రాత్రి విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్ వద్ద జరిగిన కాంగ్రెస్ పార్టీ భారీ బహిరంగ సభకు వెళ్లారు. సభ ముగిసిన తరువాత తిరుగు ప్రయాణమయ్యారు. ఆదివారం వేకువజామున పెదబయలు మండలం అరడకోట పంచాయతీ చెరువువీధి గ్రామ జంక్షన్ వద్ద వచ్చే సరికి వ్యాన్ బోల్తా ... మిగతా 8వ పేజీలో



తొడగొడుతున్న యువతి..



పల్నాడు జిల్లా బొప్పూడి ప్రజాగళం సభకు హాజరైన జనం



ప్రజాగళం సభలో ప్రసంగిస్తున్న చంద్రబాబు, మోదీ, పవన్



ప్రజాగళం సభకు వస్తున్న అమరావతి మహిళలు

ప్రజాగళం.. ప్రభంజనం

జనం జనం ప్రభంజనం.. బొప్పూడి ప్రజాగళం జనసంద్రమైంది. ఆదివారం భానుడు భగభగ మండిస్తున్నా తగ్గేదిలేదన్నట్లుగా తరలివచ్చిన అశేష జనం హర్షాతిరేకాలతో బొప్పూడి సభా ప్రాంగణం దద్దరిల్లింది. బొప్పూడికి ఇటు చిలకలూరిపేట, అటు మార్టూరు వరకు 16వ నెంబరు జాతీయ రహదారి జనంతో నిండిపోయింది. యువకులు వృద్ధులు, మహిళలు పిల్లలు అన్న తేడా లేకుండా అన్ని వర్గాల వారు కూటమి జెండాలు చేబూని బొప్పూడి వైపు కదలిరావడంతో జాతీయ రహదారిపై జన సునామీ ఆవిష్కృతమైంది. చలో బొప్పూడి అంటూ కార్యకర్తలు, నేతలు, అభిమానులు ఒక ప్రవాహంలా తరలిరావడంతో మధ్యాహ్నం మూడు గంటలకే సభా ప్రాంగణం మొత్తం జనంతో కిటకిటలాడింది. జనసునామీని చూసిన అధినేతలు ఆనందపరవశులయ్యారు. మోదీ అయితే చంద్రబాబును ప్రత్యేకంగా అభినందించారు. బొప్పూడి వేదికగా త్రిమూర్తులైన ప్రధాని నరేంద్రమోదీ, టీడీపీ, జనసేన అధి నేతలు చంద్రబాబు, పవన్‌కల్యాణ్ ఎన్నికల శంఖారావం పూరించారు. అభివృద్ధి లేక అప్పులు.. దోపిడీ దాష్టీకాలు.. అవినీతి అప్రజాస్వామిక పాలనను అంతం పలకాలని నేతలు పిలిపిచ్చారు. జెండాలు వేరైనా అజెండా ఒకటేనని.. అభివృద్ధి, సంక్షేమం, ప్రజాస్వామ్య పరిరక్షణ కావాలంటే కూటమికి ఓటేసి ఆశలు, ఆకాంక్షలు, సాకారం చేసుకోవాలని సందేశమిచ్చారు. - చిలకలూరిపేట







ప్రజాగళం సభలో మూడు పార్టీల అభిమానులు



ఉత్సాహంగా యువతులు..



బాబు,పవన్, పురంధేశ్వరి అభివాదం...



మోదీతో బాబు మాటామంతీ..



జానపద నృత్యాలు..



యువత కేరింత



మహిళలు, కార్యకర్తల ఉత్సాహం..

క్రైం... crime news

అనుమానాస్పదంగా వివాహిత మృతి

మాడుగుల రూరల్, మార్చి 17 : మండలంలోని ఓ గ్రామంలో వివాహిత ఆదివారం అనుమానాస్పదంగా మృతి చెందింది. ఇందుకు సంబంధించి స్థానికుల కథనం ప్రకారం వివరాలివి. లోవపొన్నవోలు గ్రామంలో రెడ్డి ప్రకాశ్, భవాని (28) దంపతులు తమ ఐదేళ్ల పాప, మూడేళ్ల బాబుతో పాటు భవాని తల్లి వరహాలమ్మతో కలిసి నివాసం ఉంటున్నారు. డ్రైవింగ్, కూలి పనులు చేస్తూ ప్రకాశ్ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. భవానీ తల్లి వరహాలమ్మ, ప్రకాశ్ కొద్దిరోజుల కిందట కూలి పనుల నిమిత్తం పడమట ప్రాంతానికి వలస వెళ్లారు. గ్రామంలో ఆదివారం శుభకార్యం ఉండడంతో శనివారం ఉదయం వరహాలమ్మ, ప్రకాశ్ లోవపొన్నవోలు గ్రామానికి విచ్చేశారు. శనివారం రాత్రి ప్రకాశ్‌కు, భవానికి మధ్య గొడవ జరిగినట్టు తెలుస్తోంది. కాగా ఆదివారం ఉదయం వరకు ఇంటి వద్దనే ఉన్న భవాని మధ్యాహ్నం పన్నెండు గంటల తర్వాత నుంచి కనిపించక పోవడంతో వెతకసాగారు. ఇంటికి సుమారు వంద మీటర్ల దూరంలో ఉన్న సరుగుడు తోటలో ఆమె అచేతనంగా మృతి చెంది కనిపించింది. సమాచారం తెలుసుకున్న కె.కోటపాడు సీఐ సోమునాయుడు, మాడుగుల ఎస్ఐ దామోదరనాయుడు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. భవనీ మృతికి గల కారణాలపై భర్త ప్రకాశ్, వరహాలమ్మలను విచారిస్తున్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

పేకాట శిబిరంపై దాడి

కశింకోట, మార్చి 17 : మండలంలోని తీడ గ్రామంలో పేకాట శిబిరంపై దాడి చేసినట్టు రైటర్ సూర్యారావు తెలిపారు. ఆదివారం తమకు అందిన సమాచారం మేరకు సిబ్బందితో దాడి చేయగా గ్రామానికి చెందిన నలుగురు పేకాట ఆడుతుండగా పట్టుకున్నట్టు చెప్పారు. వారి వద్ద నుంచి రూ.10,170లు నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. వారిని అరెస్టు చేసినట్టు చెప్పారు.

19 మద్యం సీసాలు స్వాధీనం

పరవాడ, మార్చి 17 : మండలంలోని ముత్యాలమ్మపాలెంకి చెందిన చింతకాయల సోములు ఆదివారం రాత్రి ప్రభుత్వ మద్యం దుకాణం నుంచి 19 క్వార్టర్ మద్యం సీసాలను కొనుగోలు చేసి ఇంటికి తీసుకు వెళుతుండగా పట్టుకున్నట్టు ఎస్ఐ మల్లేశ్వరరావు తెలిపారు. సోములుపై కేసు నమోదు చేశామన్నారు.

మూడేళ్ల చిన్నారిపై సాంబారు పడి తీవ్ర గాయం

ఎలమంచిలి, మార్చి 17: మండలంలోని లైనుకొత్తూరు కాలనీలో ఇంటిలో ఆడుకుంటున్న మూడేళ్ల చిన్నారిపై ప్రమాదవశాత్తూ సాంబారు పడడంతో కాలిపోయి తీవ్ర గాయమైంది. వెంటనే కుటుంబ సభ్యులు ఎలమంచిలి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆదివారం సాయంత్రం తల్లి డి.జ్యోతి వంట చేస్తున్న సమయంలో చిన్నారి ఆడుకుంటుండగా సాంబారు మీద పడిపోవడంతో ఈ ప్రమాదం జరిగింది. అవసరమైన వైద్య సేవలు అందించామని వైద్య సిబ్బంది తెలిపారు.

గేట్‌లో అనకాపల్లి వాసికి 7వ ర్యాంకు



నాయుడు

కొత్తూరు, మార్చి17 : గేట్ పరీక్షల్లో అనకాపల్లి జిల్లాకు చెందిన తెలుగు తేజం 7వ ర్యాంకు సాధించాడు. అనకాపల్లి మండలం కొత్తూరు ఎన్టీవోస్ కాలనీలో నివాముంటున్న కర్రి పరమేశ్వరరావు, విజయలక్ష్మి దంపతుల ప్రథమ కుమారుడు కర్రి ఎస్‌డీఎస్‌పీజీ నాయుడు గేట్ పరీక్షలో ఏడో ర్యాంకు సాధించాడు. ఈయన ఆంధ్రా యూనివర్శిటీలో నావల్ ఆర్కిటెక్చర్ మెరైన్ ఇంజనీరింగ్ నాలుగో సంవత్సరం చదువుతున్నాడు. ఏడో ర్యాంకు సాధించిన నాయుడును తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు, స్నేహితులు అభినందించారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	92.00
లైవ్ ధర	112.00
విత్ స్కిన్	194.00
స్కిన్ లెస్	204.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	425
విజయనగరం	429
శ్రీకాకుళం	429

నిరుపయోగంగా ఆర్‌అండ్‌బీ అతిథిగృహం

మరమ్మతులకు చేయని వైసీపీ ప్రభుత్వం

- శిథిలావస్థకు చేరుకున్నా పట్టించుకోని పాలకులు
- జిల్లా కేంద్రమైనప్పటికీ మారని పరిస్థితి
- హోటళ్లలోనే వీఐపీలు, ఉన్నతాధికారులు బస
- సర్క్యూట్ హౌస్ తరహాలో అభివృద్ధికి జీవీఎంసీ యత్నం
- అంగీకరించని ఆర్‌అండ్‌బీ అధికారులు



ఆర్‌అండ్‌బీ అతిథి గృహం

అనకాపల్లి టౌన్, మార్చి 17:

పట్టణంలోని గుండాలజంక్షన్‌లో ఉన్న రోడ్లు భవనాల శాఖ అతిథిగృహం నిరుపయోగంగా మారింది. ఈ అతిథిగృహం బ్రిటిష్ వారి హయాంలో నిర్మించింది. ఐదేళ్ల క్రితం వరకు ఎంతోమంది ప్రజాప్రతినిధులు, వీఐపీలకు సేద తీరేందుకు అవకాశం కల్పించిన ఈ అతిథిగృహం ఐదేళ్లుగా నిరుపయోగంగా మారింది. వైసీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత ఈ అతిథిగృహానికి మరమ్మతులు చేయించడం గాని, దీని స్థానే కొత్తది నిర్మించే ప్రయత్నం చేయలేదు. 2018 ఏడాదంతంలో ఈ అతిథిగృహాన్ని అప్పటి ఆర్‌అండ్‌బీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు తుమ్మపాలలో జరిగే కార్యక్రమానికి హాజరయ్యే ముందు సందర్శించారు. అతిథిగృహం పరిస్థితి చూసి రూ.రెండు కోట్లు మంజూరు చేస్తున్నట్టు ప్రకటించారు. నిధులు విడుదలయ్యేలోపే ఎన్నికల షెడ్యూల్ రావడం, ఎన్నికల తర్వాత వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. మంజూరైన నిధులన్నీ వైసీపీ ప్రభుత్వం నిలిపివేయడంతో ఈ అతిథిగృహాన్ని పట్టించుకునే నాథుడే కరువయ్యారు. స్థానిక ప్రజాప్రతినిధులు సైతం ఈ అతిథిగృహం వైపు కన్నెత్తి చూడకపోవడం గమనార్హం. అనకాపల్లి జిల్లాగా ఏర్పడి రెండేళ్లు కావస్తున్నది. జిల్లా కేంద్రంలో జరిగే ప్రభుత్వ కార్యక్రమాలకు అతిథులు వచ్చినప్పుడు వారి విడిదికి అతిథిగృహం అందుబాటులో లేకపోవడంతో ప్రైవేటు హోటళ్లల్లో బస చేయాల్సి వస్తున్నది. ఇటీవల అనకాపల్లి వచ్చిన జీవీఎంసీ కమిషనర్ ఈ అతిథిగృహాన్ని కూడా పరిశీలించారు. జీవీఎంసీకి అప్పగిస్తే సర్క్యూట్‌హౌస్ ఏర్పాటుచేయాలనే ఆలోచనను వ్యక్తం చేశారు. అయితే ఆర్‌అండ్‌బీ అధికారులు అందుకు నిరాకరించినట్టు సమాచారం. జీవీఎంసీకి ఇచ్చి ఉంటే సుందరమైన సర్క్యూట్‌హౌస్ నిర్మాణమయ్యేదని పలువురు చెబుతున్నారు. గతంలో అతిథిగృహానికి ఆనుకుని జేఈ, సిబ్బంది కార్యాలయాలు ఉండేవి. ఆ భవనాలు కుప్పకూలిపోవడంతో అధికారులు కొద్దిరోజులు రెండో నంబరు అతిథిగృహం వద్ద విధులు నిర్వహించేవారు. అయితే భవనాలు పూర్తిగా శిథిలావస్థకు చేరుకోవడంతోపాటు అనకాపల్లి జిల్లాగా ఏర్పడడంతో ఆర్‌అండ్‌బీ ప్రధాన కార్యాలయంలో కొప్పాకలో ఏర్పాటైంది. అధికారులు అక్కడి నుంచే తమ విధులను నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం ఎన్నికల సీజన్ ప్రారంభమైంది. ఈ సమయంలో ఎన్నికల పర్యవేక్షకులు, ఉన్నతాధికారులు జిల్లా కేంద్రంలో పర్యటిస్తారు. జిల్లా కేంద్రమైన అనకాపల్లిలో ఉన్న ఏకైక ఆర్‌అండ్‌బీ అతిథిగృహం మూలకు చేరడంతో స్థానిక హోటళ్లల్లో వీఐపీలు ఉండాల్సి వస్తున్నది. ఏమైనా జిల్లా కేంద్రంలో ప్రభుత్వ అతిథిగృహం లేకపోవడం విశేషం. ఈ విషయమై ఆర్‌అండ్‌బీ అధికారులను వివరణ కోరగా.. భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరినందున తొలగించడం కోసం ఉన్నతాధికారులకు నివేదిక పంపామని చెబుతున్నారు.

ఇష్టారాజ్యంగా ఇసుక తవ్వకాలు!

- గెడ్డ, వాగుల నుంచి ఎడ్ల బండ్లపై తరలింపు
- పట్టించుకునేవారు లేకపోవడంతో రెచ్చిపోతున్న అక్రమార్కులు



ఏఎల్‌పురంలో ఎడ్ల బండ్ల ద్వారా ఇసుకను అక్రమంగా తరలిస్తున్న దృశ్యం

కృష్ణాదేవిపేట, మార్చి 17: గొలుగొండ- కొయ్యూరు మండలాల సరిహద్దుల్లో గల బొడ్డేరు గెడ్డ, వాగుల్లో ఇసుక అక్రమ తవ్వకాలు జోరందుకున్నాయి. నిత్యం ఈ తంతు సాగుతున్నా కన్నెత్తి చూసేవారు కరువయ్యారు. ఫలితంగా పలువురు ఇష్టారాజ్యంగా ఇసుకను తవ్వుకుపోతూ రెండు చేతులా ఆర్జిస్తున్నారు. గొలుగొండ మండలం కొంగసింగి, ఏఎల్‌పురం, పాతకృష్ణాదేవిపేట, రత్నంపేట గ్రామాలకు చెందిన సుమారు 120 వరకు ఎడ్ల బండ్లు ఇసుక అక్రమ రవాణా సాగిస్తున్నాయని పలువురు వాపోతున్నారు. చోద్యం బొడ్డేరు గెడ్డ, కొయ్యూరు మండలం రామ్‌నగర్, కొత్తూరు తదితర వాగుల్లో ఈ తవ్వకాలు చేపడుతున్నారు. బండి ఇసుకను రూ.వెయ్యి చొప్పున అమ్మకాలు జరుపుతున్నారని అంటున్నారు. మండలంలో ఇసుక రవాణాకు ఎటువంటి అనుమతులు లేకపోయినప్పటికీ పోలీస్, ఎక్సైజ్, రెవెన్యూ అధికారులు పట్టించుకోకపోవడంతో ఈ తరలింపు మరింత జోరందుకుంది. ఇప్పటికైనా ఆయా శాఖల అధికారులు దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.

కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

- జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు బొడ్డు శ్రీనివాస్

అనకాపల్లి టౌన్, మార్చి 17: సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు బొడ్డు శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ఆదివారం సాయంత్రం స్థానికంగా ఒక హోటల్‌లో జిల్లా కాంగ్రెస్ నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ ఆవరణలో జరిగిన బహిరంగసభను విజయవంతం చేసిన పార్టీ శ్రేణులను అభినందించారు. వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యే, ఎంపీ టికెట్లు కేటాయించిన వారి విజయానికి పనిచేయాలని ఆయన కోరారు. రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షులు మీసాల సుబ్బన్న మాట్లాడుతూ దేశంలో, రాష్ట్రంలో కాంగ్రెస్ పవనాలు వీస్తున్నాయన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జగతా శ్రీనివాస్ మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో బీజేపీ, వైసీపీలతోపాటు టీడీపీ, జనసేన పార్టీలను చిత్తుగా ఓడించాలని కోరారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఐఆర్ గంగాధర్, జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు తనకాల అనంతరావు, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు ఎంవీఆర్ రాహుల్, జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శులు మలపరెడ్డి కోటేశ్వరరావు, కాళ్ల సత్యనారాయణ, అనకాపల్లి పట్టణ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు దాసరి సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

వాహన తనిఖీలు ముమ్మరంగా చేపట్టాలి

- కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి, ఎస్పీ కేవీ మురళీకృష్ణ



తాండవ చెక్‌పోస్టు వద్ద పోలీసులతో మాట్లాడుతున్న కలెక్టర్, ఎస్పీ

పాయకరావుపేట, మార్చి 17: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మద్యం, సారా, మత్తు పదార్థాలు అక్రమ రవాణా అరికట్టేందుకు చెక్ పోస్టుల వద్ద వాహనాల తనిఖీలు ముమ్మరంగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ రవి పట్టన్ శెట్టి పోలీసులను ఆదేశించారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో స్థానిక తాండవ షుగర్స్ సమీపంలో ఏర్పాటుచేసిన పోలీస్ చెక్‌పోస్టును ఆదివారం రాత్రి జిల్లా ఎస్పీ కేవీ.మురళీకృష్ణతో కలిసి కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్థానిక పోలీసులతో మాట్లాడుతూ డబ్బు, ఉచిత కానుకలు రవాణాపై దృష్టి సారించాలన్నారు. ఆయన వెంట నర్సీపట్నం డీఎస్పీ జీఆర్ఆర్.మోహన్, సీఐలు ధనుంజయరావు, పి.అప్పలరాజు ఉన్నారు.

నక్కపల్లిలో.. మండలంలోని వేంపాడు హైవే టోల్ ప్లాజా వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును ఆదివారం రాత్రి జిల్లా కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి, జిల్లా ఎస్పీ మురళీకృష్ణ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్, ఎస్పీ మాట్లాడుతూ అన్ని వాహనాలను తనిఖీ చేయాలని ఆదేశించారు. చెక్‌పోస్టును తనిఖీ చేసిన కలెక్టర్, ఎస్పీ అక్కడే ఉన్న తహసీల్దార్ శ్రీకాంత్, సీఐ విజయ్‌కుమార్‌లకు పలు సూచనలు చేశారు.

ఎలమంచిలిలో.. సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా జిల్లా కలెక్టరు రవి పట్టన్‌శెట్టి, జిల్లా ఎస్పీ కేవీ మురళీకృష్ణ ఆదివారం రాత్రి మండలంలోని రేగుపాలెం జంక్షన్ వద్ద స్థానిక అధికారులతో మాట్లాడారు. ఎలమంచిలి అసెంబ్లీ రిటర్నింగ్ అధికారిణి మనోరమ, సిబ్బందికి కలెక్టరు పలు సూచనలు చేశారు.



రేగుపాలెం జంక్షన్ వద్ద ఎన్నికల అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్, ఎస్పీ



మోదకొండమ్మ ఆలయంలో బారులు తీరిన భక్తులు

మోదకొండమ్మ దర్శనానికి పోటెత్తిన భక్తులు

పాడేరు రూరల్, మార్చి 17: ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్య దైవం పాడేరు మోదకొండమ్మ దర్శనానికి భక్తులు పోటెత్తారు. ఆదివారం తెల్లవారు జాము నుంచి ఆలయంలో బారులు తీరారు. అమ్మవారికి మొక్కులు తీర్చుకొనేందుకు మన్యంలోని వివిధ గ్రామాలతో పాటు మైదాన ప్రాంతం నుంచి వచ్చిన భక్తులు అమ్మవారికి ఘటాలను సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. వందలాది మంది భక్తులు తరలిరావడంతో ఆలయం రద్దీగా మారింది. అమ్మవారికి ఘటాలను సమర్పించి పండగ జరుపుకున్న మైదాన ప్రాంత భక్తులు ఆలయ ప్రాంగణంలోనే వంటలు చేసుకొని సాయంత్రం వరకు సందడిగా గడిపారు. ఆలయ ప్రధాన కార్యదర్శి కొట్టగుళ్లి సింహాచలం నాయుడు ఆధ్వర్యంలో ప్రసాద కమిటీ సభ్యులు కొట్టగుళ్లి రామారావు, కొట్టగుళ్లి పోతురాజు, సిద్ధినాతి కొండలరావు, బొడ్డు ముకుందరావు, శివరాత్రి శ్రీనివాస్‌కుమార్, ఆర్‌కే.రాజు తదితరులు భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు. అలాగే పాడేరు ఘాట్‌లో మోదాపల్లి సమీపంలో ఉన్న మోదకొండమ్మ పాదాలకు (అమ్మవారి పాదాలు) వద్దకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారి మొక్కులు తీర్చుకున్నారు. అక్కడే వంటలు చేసుకొని కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో సాయంత్రం వరకు ఆనందంగా గడిపారు.

జనసేనలోకి గంపరాయి వైసీపీ కార్యకర్తలు

పెదబయలు, మార్చి 17: మండలంలోని గంపరాయి పంచాయతీ పరిధిలో కాగుల, అల్లంపుట్టు గ్రామాలకు చెందిన పలువురు వైసీపీ కార్యకర్తలు ఆదివారం జనసేన పార్టీలో చేరారు. వారిని జనసేన మండల అధ్యక్షుడు బాబూరావు పార్టీ కండువాలు కప్పి సాదరంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ పాలనలో ప్రజలు, ప్రధానంగా యువత విసుగుచెంది జనసేనలో చేరుతున్నారని చెప్పారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ-జనసేన-బీజేపీ ఉమ్మడి అభ్యర్థుల గెలుపు కోసం కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. జీవో నంబర్-3 పునరుద్ధరణ, గిరిజన ప్రాంతంలో ఖనిజ సంపద పరిరక్షణ కోసం ఆదివాసీలు టీడీపీ-జనసేన-బీజేపీ ఉమ్మడి అభ్యర్థి సియ్యారి దొన్నుదొరను గెలిపించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యనిర్వహణ కమిటీ సభ్యులు పరదాని సురేష్, ముద్దక్రిష్ణ, కొండబాబు తదితరులు పాల్గొన్నారు.


వైసీపీ నుంచి జనసేనలో చేరిన కార్యకర్తలను ఆహ్వానిస్తున్న పార్టీ మండల అధ్యక్షుడు బాబూరావు

50 కిలోల గంజాయితో నలుగురి అరెస్టు


గంజాయి, నిందితులతో ఎస్ఐ రాజారావు, ఏపీఎస్పీ పోలీసులు

చింతపల్లి, మార్చి 17: ఒడిశా నుంచి పొరుగు రాష్ట్రాలకు తరలిస్తున్న 50 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నామని, నలుగురిని అరెస్టు చేశామని అన్నవరం ఎస్ఐ రాజారావు తెలిపారు. దీనికి సంబంధించిన వివరాలను ఆదివారం ఆయన స్థానిక విలేకరులకు వెల్లడించారు. సీఐ కె.రమేశ్ ఆధ్వర్యంలో లోతుగెడ్డ-నిమ్మపాడు మార్గంలో పోలీసులు ఆదివారం ఉదయం వాహనాల తనిఖీలు చేస్తుండగా ఓ కారు, ద్విచక్ర వాహనంపై వచ్చిన నలుగురు వ్యక్తులు వెనక్కి వెళ్లిపోయే ప్రయత్నం చేశారన్నారు. వెంటనే అప్రమత్తమై వాహనాన్ని అడ్డుకుని నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నామన్నారు. వారు తమిళనాడు తిరుచనాపల్లి హరి భాస్కర్ కాలనీకి చెందిన రోహన్ దేవ్, జయశీలన్ కృష్ణన్, కాకినాడ జిల్లా తుని మండలం కొండవీధికి చెందిన కటారి రాజు, మువ్వల బాబ్జీలుగా గుర్తించామన్నారు. నిందితుల నుంచి గంజాయి, నాలుగు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకుని అరెస్టు చేశామన్నారు. ఈ సమావేశంలో ఏపీఎస్పీ పోలీసులు పాల్గొన్నారు.

రెండు బైక్‌లు ఢీకొని ఇద్దరికి తీవ్ర గాయాలు

జి.మాడుగుల, మార్చి 17: మండలంలోని పాలమామిడి పంచాయతీ సమీప ప్రధాన రహదారిలో రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొట్టిన ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు తగిలాయి. ఇందుకు సంబంధించి స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. చింతపల్లి మండలం కొమ్మంగి పంచాయతీ పెద్దూరు గ్రామానికి చెందిన కూడ చందర్‌రావుతో పాటు కూడ వాసు ద్విచక్ర వాహనంలో పాడేరు వైపు వస్తుండుగా, అదే మండలం తమ్మంగుల గ్రామానికి చెందిన వ్యక్తి తన ద్విచక్ర వాహనంతో ఎదురెదురు వస్తూ పాలమామిడి సమీపంలో ఢీకొన్నారు. దీంతో పెద్దూరు గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులకు తీవ్రంగా గాయలై అపస్మారక స్థితికి చేరుకున్నారు. స్థానికులు 108లో పాడేరు జిల్లా ఆసుపత్రికి తరలించారు.


సంఘటనా స్థలంలో పడివున్న క్షతగాత్రులు

దారీతెన్నూ లేకపాయె!

... 5వ పేజీ తరువాయి

లోతేరు- కాగువలస వయా దూద్‌కొండి, ముసిరిగుడ గ్రామం మీదుగా అరకుకు, లోతేరు పంచాయతీకి శివారు గ్రామం అంటపర్తి వరకు సుమారు 6 కిలోమీటర్ల మట్టి రోడ్డును, అవసరమైన చోట కల్వర్టులను నిర్మించారు. అయితే ఈ మార్గాల్లో అవసరమైన చోట సీసీ ర్యాంప్‌లు, రక్షణ గోడలు, కాలువల నిర్మాణంతో పాటు మట్టిరోడ్డుపై గ్రావెల్ వేసి పూర్తి చేయాల్సి ఉంది. బిల్లులు సకాలంలో విడుదలకాకపోవడంతో రహదారి పనులు నిలిచిపోయాయి. అలాగే అంటిపర్తి గ్రామానికి మరో వైపు నుంచి ఈఐ(ఎడ్యుకేషన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్) గ్రాంటు కింద మొర్రిగుడ గ్రామం నుంచి అడ్డుమండ మీదుగా అంటిపర్తికి తారు రోడ్డు నిర్మాణానికి రూ.1.8 కోట్లతో రెండేళ్ల క్రితం పనులు ప్రారంభించారు. మొర్రిగుడ నుంచి అంటిపర్తి వరకు అవసరమైన ఐదు చోట్ల పైప్ కల్వర్టులు నిర్మించారు. అయితే అప్రోచ్ రోడ్డు మాత్రం నిర్మించలేదు. దీంతో ఈ మార్గం నిరుపయోగంగా ఉంది. బొండాం పంచాయతీలో జయంతివలస- కొల్యాగుడ- బొండాం కొత్తవలస వరకు తారు రోడ్డు నిర్మించాల్సి ఉన్నప్పటికి పనులు ప్రారంభించలేదు. జయంతివలస- కొల్యాగుడ మధ్యలో పెద్దగెడ్డపై వంతెనను రూ.రెండు కోట్ల వ్యయంతో నిర్మించారు. వంతెన పనులు పూర్తిచేసిన కాంట్రాక్టరుకు సుమారు రూ.90 లక్షల మేర బిల్లు బకాయి ఉంది. వంతెనకు అప్రోచ్ రోడ్డుతో పాటు జయంతివలస నుంచి కొల్యాగుడ జంక్షన్ వరకు తారు రోడ్డు నిర్మించాల్సి ఉన్నా బిల్లులు రావనే ఉద్దేశంతో కాంట్రాక్టరు ఆ పనులు చేపట్టేందుకు ముందుకు రాలేదు. కొండ శిఖర గ్రామాల కు రహదారులు నిర్మించాలన్న లక్ష్యం మంచిదే అయినా రాష్ట్ర ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడం వల్ల పనులు పూర్తికాలేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీని వల్ల తమకు కష్టాలు తప్పడం లేదని ఆదివాసీలు వాపోతున్నారు.

కోడ్ అమలుకు పటిష్ట చర్యలు

... 5వ పేజీ తరువాయి

ప్రలోభ పెట్టేందుకు డబ్బు, మద్యం, బహుమతులు పంపిణీ చేయరాదని, అటువంటి చర్యలకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు చేపడతామన్నారు. ప్రజలు రూ.50 వేలకు మించి నగదుతో ప్రయాణాలు చేయకూడదని, రూ.10 వేలు అంతకు మించి విలువైన వస్తువులను కలిగి ఉండకూడదన్నారు. జిల్లాలో మావోయిస్టుల ప్రభావం నేపథ్యంలో మారుమూల ప్రాంతాల్లో అభ్యర్థులు ప్రచారానికి వెళ్లే క్రమంలో రెండు రోజులు ముందుగానే పోలీసులు అనుమతి పొందాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు ఎన్నికల నిబంధనలను పాటించాలని, నిష్పక్షపాతంగా, పారదర్శకంగా ఉండాలని ఎస్పీ సూచించారు. రాజకీయ పార్టీలకు అనుకూలంగా ఉద్యోగులు పనిచేస్తే వారిపై చట్టపరంగా చర్యలు చేపడతామన్నారు. ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించేవారిపై చర్యలు తప్పవని, ప్రజలు ప్రశాంతంగా ఓటు వేసేందుకు అవసరమైన చర్యలు చేపడుతున్నామని ఎస్పీ తెలిపారు.

దొంగతనాల జోరు.. ప్రజల బేజారు!

ఏ రోజు ఎక్కడ దొంగలు పడతారోనన్న భయం.. అనుక్షణం బిక్కుబిక్కుమంటూ కాలం వెల్లదీస్తున్న జనం.. వారి ఆందోళనకు తగ్గట్టుగానే చోరుల బీభత్సం.. ఇదీ ముంచంగిపుట్టు మండలంలో జరుగుతున్న తతంగం. మండల కేంద్రంలో దొంగతనాలు జోరందుకోవడం.. ఇటీవల మాకవరం పంచాయతీలో చోరులు కత్తులు, తుపాకులతో బీభత్సం సృష్టించడం.. ఇది మరువకముందే తాజాగా ముంచంగిపుట్టులో చోరీ ప్రయత్నం జరగడంతో కంటి మీద కునుకు ఉండడం లేదని వ్యాపారులు, ప్రజలు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు.

- ముంచంగిపుట్టులో మరోసారి దొంగలు హల్‌చల్
- ఓ ఇంటిలో చోరీకి ప్రయత్నం.. కుటుంబీకుల అప్రమత్తం
- బాధితులు, స్థానికుల కేకలు.. పారిపోయిన దొంగలు
- ఇటీవల మాకవరంలో కత్తులు, తుపాకులతో బీభత్సం
- భీతిల్లుతున్న జనం.. చోద్యం చూస్తున్న పోలీసు యంత్రాంగం

ముంచంగిపుట్టు, మార్చి 17: మండల కేంద్రంలో శనివారం రాత్రి దొంగలు హల్‌చల్ చేశారు. గ్రామ పొలిమేరలో ఉన్న ఒక ఇంటిలో దొంగతనం చేసేందుకు విఫలయత్నం చేశారు. అయితే ఇంటిలో ఉన్నవారు గట్టిగా కేకలు వేయడం, స్థానికులకు ఫోన్ ద్వారా సమాచారం అందించడంతో దొంగలు అక్కడ నుంచి జారుకున్నారు. వివరాల్లోకి వెళ్తే...

గ్రామ శివారులోని జోషి అనే వ్యాయామ ఉపాధ్యాయుడు కుటుంబ సభ్యులతో నివాసం ఉంటున్నాడు. శనివారం అర్ధ రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు వచ్చి తలుపులను గట్టిగా బాదడంతో లోపల ఉన్న వారు అప్రమత్తమయ్యారు. తలుపులను తీయకుండా వాటికి అడ్డంగా సోఫాసెట్‌ను పెట్టి పెద్దగా కేకలు వేయడంతో పాటు జరుగుతున్న విషయాన్ని స్నేహితులకు ఫోన్ ద్వారా తెలియజేశారు. దీంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో పాటు స్థానిక యువకులు, పోలీసులు హుటాహుటిన ఆ ఇంటికి చేరుకొనేలోగా దొంగలు అక్కడ నుంచి జారుకున్నారు. అయితే సుమారు గంట పాటు దొంగతనానికి గుర్తుతెలియని వ్యక్తులు ప్రయత్నించారని జోషి తెలిపాడు. తలుపు కన్నం నుంచి కొంతమంది గుర్తు తెలియని వ్యక్తులు కనిపించారని ఆడామగ కలసి సుమారు ఆరుగురు ఉన్నారని, వారి చేతిలో కత్తులు ఉన్నాయని తెలిపాడు. రాత్రి గస్తీ కాస్తున్న పోలీసులు, స్థానిక యువకులు ఆ ఇంటికి చేరుకోవడంతో దొంగతనం తప్పింది. లేకుంటే మరో దొంగతనం జరిగి ఉండేది. గత కొద్ది రోజులుగా మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో వరుస దొంగతనాలు, దారి దోపిడీలు జరుగుతున్నాయి. ఇటీవల మాకవరం పంచాయతీలో దొంగలు కత్తులు, తుపాకులతో ఓ ఇంటిలో ప్రవేశించి బంగారం, నగదు అపహరించుకుపోయిన విషయం తెలిసిందే. దీంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. రాత్రి వేళల్లో ఎవరి ఇంటిలోకి దొంగలు పడతారోనని బిక్కుబిక్కుమంటూ కాలం గడుపుతున్నారు. అయినప్పటికీ పోలీసులు చోద్యం చూస్తున్నారని వారు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా దొంగతనాలు జరగకుండా తగిన చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.



మాకవరంలోని ఓ ఇంట్లోకి దొంగలు తుపాకులతో ప్రవేశించి బంగారం, నగదు అపహరించి చిందర వందర చేసిన వస్తువులు.. ముంచంగిపుట్టులోని ఓ షాపులో సామాన్లను చిందర వందర చేసిన చోరులు (ఫైల్ ఫొటోలు)



ముంచంగిపుట్టులో శనివారం అర్ధ రాత్రి చోరీకి ప్రయత్నించిన ఇల్లు ఇదే... దొంగలు తలుపులను పగలగొట్టే ప్రయత్నంలో కిందపడ్డ గోడ పెచ్చులు

మన్యంలో పది పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

- పాడేరులో ఐదు పరీక్షా కేంద్రాలు
- 14 పాఠశాలల నుంచి 1,080 మంది విద్యార్థులు

పాడేరు రూరల్, మార్చి 17: మన్యంలో పదో తరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తయాయయి. ఈ నెల 18 నుంచి 30వ తేదీ వరకు జరగనున్న ఈ పరీక్షలకు పాడేరు మండలంలో ఐదు కేంద్రాలను ఏర్పాటు చేశారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాల, తలారిసింగి, లోచలిపుట్టు, ఏపీఆర్ స్కూల్, శ్రీకృష్ణాపురం (ఐదు) పాఠశాలల్లో ఏర్పాటు చేసిన ఈ కేంద్రాల్లో 14 పాఠశాలలకు చెందిన 1,080 మంది విద్యార్థినీ విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పరీక్షలు నిర్వహించనున్నామన్నారు. విద్యార్థులు గంట ముందుగా పరీక్ష కేంద్రాలకు రావాలని ఎంఈవో-2 చీపురు సరస్వతీదేవి తెలిపారు.



చింతపల్లి పరీక్షా కేంద్రంలోని బెంచీలపై నంబర్లు రాస్తున్న చీఫ్ సూపరింటెండెంట్లు... హుకుంపేటలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న అధికారులు

చింతపల్లిలో...

చింతపల్లి: మండల కేంద్రంలోని నాలుగు పరీక్ష కేంద్రాల్లో పదో తరగతి రెగ్యులర్, దూర విద్య పరీక్షలు నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేశారు. పదో తరగతి రెగ్యులర్ మూడు పరీక్ష కేంద్రాల్లో 681 మంది, దూర విద్య ఇంటర్, పది విద్యార్థులు 639 మంది పరీక్షలకు హాజరుకానున్నారన్నారు. విద్యార్థులకు పరీక్ష కేంద్రాల్లో మంచినీరు, మరుగుదొడ్లు, విద్యుత్ సదుపాయం కల్పిస్తున్నారు. స్థానిక జిల్లా పరిషత్, బాలూర, బాలికల ఆశ్రమ పాఠశాలను ఆదివారం ఎంఈవో పనసల ప్రసాద్ సందర్శించారు. విద్యార్థులకు అందుబాటులోనున్న సదుపాయాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పరీక్ష కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లు సాగిన రామరాజు పడాల్, జేపీ కొండలరావు, ప్రభుదాస్ పాల్గొన్నారు.

కొయ్యూరులో...

కొయ్యూరు: మండలంలోని మూడు కేంద్రాలలో జరుగనున్న పదో తరగతి పరీక్షలకు ఏర్పాట్లు చేసినట్టు ఎంఈవో రాంబాబు, ఏటీడబ్ల్యూవో క్రాంతికుమార్ తెలిపారు. ప్రభుత్వ ఉన్న పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కస్తూర్బాగాంధీ పాఠశాలతో పాటు మరో 11 గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలకు చెందిన 638 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నట్టు వారు వివరించారు. ఇందుకు గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాల-1, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, గురుకుల పాఠశాల పరీక్ష కేంద్రాలుగా ఏర్పాటు చేశామన్నారు.

జి.మాడుగులలో...

జి.మాడుగుల: పదో తరగతి పరీక్షలకు పటిష్ట ఏర్పాట్లు చేశామని ఏటీడబ్ల్యూవో తిరుపాల్ తెలిపారు. మండలం నుంచి పలు పాఠశాల నుంచి 541 మంది విద్యార్థులకు నాలుగు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు చెప్పారు. విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు.

ముంచంగిపుట్టులో...

ముంచంగిపుట్టు: మండలంలో పదో తరగతి పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తిచేసినట్టు హెచ్ఎం మాణిక్యాలరావు తెలిపారు. పరీక్షల ఏర్పాట్లను ఆదివారం ఆయన పరిశీలించారు. పరీక్షలను పగడ్బందీగా నిర్వహించేందుకు తగిన ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు. ప్రతీ గదిలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. మండలంలో మూడు సెంటర్ల నుంచి 461 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతారని ఆయన తెలిపారు.

డుంబ్రిగుడలో...

డుంబ్రిగుడ: మండలంలో పదో తరగతి పరీక్షకు 430 మంది విద్యార్థులు హాజరవుతున్నారని ఎంఈవో సుందర్‌రావు తెలిపారు. కేంద్రాల్లో మంచినీటి, మరుగుదొడ్లు, బెంచీలు, ఫ్యాన్లు ఏర్పాటు చేసినట్టు చెప్పారు. గిరిజన బాలుర ఆశ్రమ, ప్రభుత్వ ఉన్నత, బాలికల గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. మాస్ కాపీయింగ్ లేకుండా చర్యలు చేపట్టామని, బయటి వ్యక్తుల ప్రవేశం నిషేధిస్తామని చెప్పారు.

హుకుంపేటలో...

హుకుంపేట: మండలంలో టెన్త్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు చేసినట్టు హెచ్ఎం బాలజీ, డీవో ప్రదీప్‌చంద్ర తెలిపారు అన్ని కేంద్రాల్లో బెంచీల సదుపాయం కల్పిస్తామన్నారు. ఈ పరీక్షలకు విద్యార్థులతో ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేసినట్టు తెలిపారు

టీడీపీతోనే మారుమూల గ్రామాల అభివృద్ధి

ముంచంగిపుట్టు, మార్చి 17: తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తేనే మారుమూల గ్రామాలు అభివృద్ధి చెందుతాయని ఆ పార్టీ నాయకులు పేర్కొన్నారు. మండలంలోని ఏనుగురాయి పంచాయతీ గాదెలబురుగు గ్రామంలో ఆదివారం బాబు షూరిటీ.. భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రవేశ పెట్టనున్న ఆరు పథకాలను ప్రజలకు వివరించారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సియ్యారి దొన్నుదొరను గెలిపించాలని నాయకులు అభ్యర్థించారు. తమ పార్టీ అధికారంలోకి వస్తేనే గ్రామాల అభివృద్ధితో పాటు నిరుద్యోగ యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు, అర్హులైన ప్రతీ ఒక్కరికి సంక్షేమ, అభివృద్ధి ఫలాలు అందుతాయని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు కె.బలరాం, ప్రధాన కార్యదర్శి కె.జగత్‌రాయ్, రాష్ట్ర ఎస్టీ సెల్ ఆర్గనైజేషన్ సెక్రటరీ ఎ.తిరుపతిరావు, సర్పంచ్ వి.లక్ష్మణ్, నాయకులు ఎం.చిన్ని, జి.తిరుపతి, ప్రమోదపడాల్ తదితరులు పాల్గొన్నారు.


గాదెలబురుగులో ప్రజలకు టీడీపీ పథకాలను వివరిస్తున్న నాయకులు

జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా శ్రీనివాసరావు బాధ్యతల స్వీకారం

పాడేరు రూరల్, మార్చి 17: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా శరడం శ్రీనివాసరావు శనివారం బాధ్యతలను చేపట్టారు. విశాఖపట్నం జిల్లా పెందుర్తి ప్రభుత్వ జూనియర్ కళాశాల్లో ప్రిన్సిపాల్‌గా అదనపు బాధ్యతలను నిర్వహిస్తున్న శ్రీనివాసరావుకు ఉద్యోగోన్నతి కల్పించి ఇక్కడ నియమించారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ రమాదేవి నుంచి ఆయన బాధ్యతలను చేపట్టారు. కళాశాల అధ్యాపకులు, సిబ్బంది ప్రిన్సిపాల్‌కు అభినందనలు తెలిపారు.

పోలీసులకు నాటు తుపాకీ అప్పగింత

సీలేరు, మార్చి 17: స్థానిక పోలీసు స్టేషన్ పరిధిలోని గాలికొండ పంచాయతీ ఆకులూరు గ్రామానికి చెందిన పాంగి రామదాసు తన వద్ద ఉన్న నాటు తుపాకీని ఎస్ఐ రామకృష్ణకు అప్పగించాడు. జిల్లా ఎస్పీ తుహిన్‌సిన్హా ఎక్కడైనా ఎటువంటి లైసెన్సులు లేకుండా నాటు తుపాకీలు ఉంటే వెంటనే సమీప పోలీస్టేషన్లకు అప్పగించాలని కోరిన విషయం తెలిసిందే. ఈ మేరకు రామదాసు తన వద్ద ఉన్న నాటుతుపాకీని అప్పగించాడని ఎస్ఐ తెలిపారు. అలాగే సీలేరు పోలీసు స్టేషన్ పరిధిలో ఇంకా ఎవరి వద్దనైనా తుపాకులు ఉంటే వెంటనే స్వచ్ఛందంగా అప్పగించాలని ఎస్ఐ కోరారు. పోలీసుల సోదాల్లో ఎవరి వద్దనైనా నాటు తుపాకీలను గుర్తించినట్లయితే చట్ట ప్రకారం చర్యలు తప్పవని ఎస్ఐ హెచ్చరించారు.

ఫ్లెక్సీలు తొలగించాలి: ఎంపీడీవో

గూడెంకొత్తవీధి, మార్చి 17: గ్రామాల్లో రాజకీయ పార్టీ నాయకుల ఫ్లెక్సీలు, బ్యానర్లు తొలగించాలని ఎంపీడీవో ఉమామహేశ్వరరావు ఆదేశించారు. మండల కేంద్రంలోని రాజకీయ పార్టీ నాయకుల ఫ్లెక్సీలను పంచాయతీ సిబ్బంది ఆదివారం తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నిక కోడ్ అమలులోకి రావడంతో రాజకీయ పార్టీల నాయకులు, ఉద్యోగులు ఎన్నికల ప్రవర్తన నియమావళిని పాటించాలన్నారు. ఇప్పటికే పంచాయతీ కార్యదర్శులు ఎన్నికల ప్రవర్తన నియమావళిని అమలు చేయాలని ఆదేశాలు జారీ చేశామన్నారు. పబ్లిక్ ప్రాంతాలు, ప్రభుత్వ కార్యాలయాల్లో రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధుల చిత్రాలతో కూడిన ఫ్లెక్సీలు ఉండరాదన్నారు. ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘిస్తే బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ పాపారావు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యలు పరిష్కరించండి మహోప్రభో..

డుంబ్రిగుడ, మార్చి 17: మండలంలో తాగునీటి సమస్యలు పరిష్కరించాలని గిరిజన సంఘం జిల్లా కమిటీ సభ్యుడు సూర్యనారాయణ విజ్ఞప్తి చేశారు. ఆదివారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ మండలంలో వేసవికి ముందే తాగునీటి కష్టాలు వెంటాడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేవారు. కనీస అవసరాలను తీర్చుకోవడానికి గిరిజనులు ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. గిరిజన గ్రామాల్లో తాగునీటి ఎద్దడితో ఊటగెడ్డలను ఆశ్రయిస్తూ గిరిజనులు అవసరాలను తీర్చుకుంటున్నారన్నారు. సంబంధిత అధికారులు స్పందించి గిరిజన గ్రామాల్లో తాగునీటి కష్టాలు తీర్చాలని, లేనిపక్షంలో మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఆందోళనకు దిగుతామని ఆయన హెచ్చరించారు.

విద్యుదాఘాతంతో సచివాలయం వెల్ఫేర్ అసిస్టెంట్ మృతి

- ఎన్నికల అధికారుల ఆదేశాలతో ఫ్లెక్సీ తొలగిస్తుండగా ప్రమాదం

దేవరాపల్లి, మార్చి 17: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు రాజకీయ పార్టీలకు చెందిన ఫ్లెక్సీలు తొలగిస్తుండగా గ్రామ సచివాలయం ఉద్యోగం ఒకరు విద్యుదాఘాతానికి గురై మృతిచెందాడు. ఈ సంఘటన ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు ప్రాతినిధ్యం వహిస్తున్న మాడుగుల నియోజకవర్గం దేవరాపల్లి మండలంలో జరిగింది. ఎస్ఐ డి.నాగేంద్ర తెలిపిన సమాచారం మేరకు ఈ సంఘటనకు సంబంధించి పూర్తి వివరాలిలా వున్నాయి.

విజయనగరం జిల్లా వేపాడ మండలం కుమ్మపల్లి గ్రామానికి చెందిన డెక్క చిరంజీవి (34) అనకాపల్లి జిల్లా దేవరాపల్లి మండలం కొత్తపెంట గ్రామ సచివాలయంలో వెల్ఫేర్ అసిస్టెంట్‌గా ఉద్యోగం చేస్తున్నాడు. ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో బహిరంగ ప్రదేశాల్లో రాజకీయ పార్టీలకు చెందిన ఫ్లెక్సీలు, బ్యానర్లు, పోస్టర్లను ఆదివారం సాయంత్రంలోగా తొలగించాలని ఎన్నికల కమిషన్ ఆదేశించిన విషయం తెలిసిందే. దీంతో జిల్లా ఎన్నికల అధికారుల ఆదేశాల మేరకు మండల అధికారులు తమ పరిధిలో రాజకీయ పార్టీలకు చెందిన ఫ్లెక్సీలు, బ్యానర్లు, పోస్టర్లను సత్వరమే తొలగించి, ఫొటోలను సంబంధిత యాప్‌లో అప్‌లోడ్ చేయాలని కింది స్థాయి ఉద్యోగులకు హుకుం జారీ చేశారు. కొత్తపెంట సచివాలయం పరిధిలోని ఫ్లెక్సీలు తొలగించడానికి వెల్ఫేర్ అసిస్టెంట్ డెక్క చిరంజీవి తన స్నేహితుడు దాసరి శ్రీనుతో కలిసి ద్విచక్రవాహనంపై ఆదివారం ఉదయం ఎనిమిది గంటలకు ములకలాపల్లి చేరుకున్నాడు. పాల కేంద్రానికి సమీపంలో వున్న ఒక ఫ్లెక్సీని చిరంజీవి తొలగిస్తుండగా.. దీని ఇనుప చట్రం, పైన వున్న విద్యుత్ తీగలకు తగిలింది. దీంతో విద్యుదాఘాతానికి గురయ్యాడు. సమీపంలోని పొలాల్లో పనులు చేస్తున్న రైతులు, కూలీలు వచ్చారు. ప్రాణాలు కాపాడాలన్న ఉద్దేశంతో తొలుత ఇసుక తీసుకువచ్చి అతని శరీరంపై పోశారు. (దీని వల్ల అతని శరీరం విద్యుత్ శక్తి తగ్గుతుందని...) సమీపంలో వున్న ఆరోగ్య ఉప కేంద్రం సిబ్బందిని రప్పించగా అప్పటికే మృతిచెందినట్టు వైద్య సిబ్బంది చెప్పారు. మృతుడు చిరంజీవికి భార్య హేమలత, పిల్లలు చేతన్(6), ఇషాన్(3), తల్లి కృష్ణమ్మ ఉన్నారు. హేమలత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ డి.నాగేంద్ర తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనకాపల్లి ఎన్టీఆర్ జిల్లా ఆస్పత్రి మార్చురీకి తరలించారు.

కాగా విద్యుదాఘాతంతో సచివాలయం వెల్ఫేర్ అసిస్టెంట్ మృతి చెందిన విషయం తెలుసుకున్న ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు ఘటనా స్థలానికి వెళ్లి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అలాగే మృతుడి కుటుంబాన్ని ఆదుకోవాలని అనకాపల్లి జిల్లా కలెక్టర్ రవి పట్టన్‌శెట్టికి ఫోన్ చేసి కోరారు.


డెక్క చిరంజీవి (ఫైల్)

సీలేరు నదిలో నాటు పడవ మునిగి ఒకరి మృతి

... 5వ పేజీ తరువాయి

పడవలో ఉన్న ఐదుగురిలో నలుగురు ఈత కొట్టుకుంటూ ఒడ్డుకు చేరుకోగా, మజ్జి సీమయ్య గల్లంతయ్యాడు. శనివారం అతని ఆచూకీ తెలియలేదు. దీనిపై కలిమెల పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఆదివారం ఉదయం గజ ఈతగాళ్లను సీలేరు నదిలో దింపి గాలింపు చర్యలు చేపట్టారు. దీంతో సీమయ్య మృతదేహం లభ్యమైంది. మృతదేహాన్ని కలిమెల తరలించి పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని వారి బంధువులకు అప్పగించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి దుర్మరణం

... 5వ పేజీ తరువాయి

పడింది. దీంతో వ్యాన్‌లో ఉన్నవారిలో నలుగురు స్వల్పంగా, వంతాల లవకుశ(51)కు తీవ్రంగా గాయపడ్డారు. అతనిని 108 వాహనంలో పాడేరు జిల్లా ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యంలో మృతి చెందాడు. పాడేరు జిల్లా ఆస్పత్రిలో పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబీకులకు అప్పగించామని ఎస్ఐ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు.